క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోవాలి

కేటీదొడ్డి/ధరూరు/గట్టు: రైతుబీమా పథకానికి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని కేటీదొడ్డి ఏఓ మహాలక్ష్మి, ధరూరు శ్రీలత, గట్టు ఏఓ హన్మంతురెడ్డి కోరారు. ఆయా మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుబీమా దరఖాస్తుకు శనివారంతో గడువు ముగుస్తుందని తెలిపారు. కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు స్వయంగా రైతువేదికల వద్దకు వచ్చి రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

రాజోళి: మండల కేంద్రానికి చెందిన పాస్టర్ లిక్కి యాకోబ్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ వెంకటేశ్వరమ్మ శుక్రవారం బాధితుడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వైద్యఖర్చుల నిమిత్తం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోపాల్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

గద్వాల అర్బన్: పాతపెన్షన్ విధానం సాధన కోసం ఈనెల 12న హైదరాబాద్‌లో నిర్వహించనున్న సమావేశానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఎస్ యూనియన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు విష్ణు మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరిగే సమావేశానికి జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగరాజు, గౌరవాధ్యక్షుడు బుచ్చన్న, రమేష్‌కుమార్, నర్సింహ, నాగేష్, రఘు, పాల్వాయి లక్ష్మీనారాయణ, పరుశరాముడు, ప్రతాప్, నిసార్ అహ్మద్ పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



ఎర్రవల్లిచౌరస్తా: గ్రామాల్లో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీడీఓ రాఘవ కోరారు. ఇటిక్యాల మండలంలోని జింకలపల్లి లో శుక్రవారం మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలకు క్రమం తప్పకుండా ట్రాక్టర్ల ద్వారా నీరు పోయడంతోపాటు ట్రీ గార్డులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాధిక పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీలో శుక్రవారం డాక్టర్ ప్రసూణరాణి గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు ఇచ్చారు.

సెకండ్ ఏఎన్ఎంల అరెస్ట్

రాజోళి: తమ సమస్యల సాధన కోసం అసెంబ్లీ ముట్టడి చేపట్టిన సెకండ్ ఏఎన్ఎంలను శుక్రవారం పోలీసులు అడ్డుకున్నారు. హైదరాబాద్‌కు బయలుదేరిన వారిని అరెస్ట్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు మాట్లాడుతూ తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా అక్రమ అరెస్టులు చేయడం దారుణమన్నారు.

ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్‌గా ఏసన్న

గట్టు: ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్‌గా బల్గెర ఏసన్నను ఎన్నుకున్నారు. గద్వాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ముఖ్యనాయకుల సమక్షంలో మండల ఇంచార్జ్‌గా ఏసన్నను నియమించినట్లు పేర్కొన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నియామకం



శాంతినగర్: బీఎస్పీ నాయకులకు ఆ పార్టీ చీఫ్ ప్రవీణ్‌కుమార్ కీలక పదవులు కట్టబెట్టారు. శాంతినగర్‌లోని బీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు నాయకులకు కీలక పదవులు అప్పగిస్తూ నియామక పత్రాలు అందజేశారు. జిల్లా కార్యదర్శులుగా జల్లాపురం రాంగోపాల్‌రెడ్డి, మాచర్ల ప్రకాష్, ఉండవెల్లి కార్యదర్శిగా శివశంకర్‌గౌడ్, అలంపూర్ అధ్యక్షుడిగా సురేష్, కన్వీనర్‌గా నాగరాజులను నియమించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

అలంపూర్ రూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. క్యాతూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం పలు గ్రామాల్లో డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఇంటింటికెళ్లి నిల్వ నీటిని పారబోశారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఇళ్లల్లో ఎక్కువ రోజులపాటు నీటి నిల్వలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సూచిక బోర్డులేవీ?

- ప్రమాదకరంగా మారిన మూల మలుపులు
- రోడ్లకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



కారుపాకుల స్టేజీ మలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు

ఎర్రవల్లిచౌరస్తా: రోడ్ల మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మూల మలుపుల వద్ద సూచికబోర్డులు లేకపోవడం.. ఇరువైపులా ముళ్లపొదలు, కంపచెట్లు ఏపుగా పెరగడంతో వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఎర్రవల్లి చౌరస్తా, ఇటిక్యాలకు వచ్చే మార్గాల్లో అధికంగా మూల మలుపులు ఉన్నాయి. కారుపాకుల స్టేజీ, వీరాపురం, దువాసిపల్లి స్టేజీ, సాసనూలు కాల్వ, ఎర్రవల్లి రైస్‌మిల్లు, జింకలపల్లి, మునగాల కాల్వ, శివనంపల్లి స్టేజీ, రైల్వేస్టేషన్ వద్ద ఉన్న మలుపులు ప్రమాదకరంగా మారాయి. రోడ్లకు ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలు, ఇతర చెట్లతో మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేకపోతున్నారు. ఈ మలుపుల వద్ద అనేక ప్రమాదాలు జరిగి వాహనదారులు ప్రాణాలను కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. మలుపుల వద్ద నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వర్షాకాలంలో రోడ్లకు ఇరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరుగుతాయని తెలిసి కూడా పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి.. ముళ్ల పొదలను తొలగించకపోవడంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. అదే విధంగా రోడ్ల పక్కన ప్రమాదకరంగా గుంతలు, బావులు ఉన్నా ఎవరూ పట్టించుకోవడంలేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయడంతోపాటు ముళ్లపొదలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



సాసనూలు స్టేజీ సమీపంలో ఏపుగా పెరిగిన ముళ్లపొదలు

ప్రమాదాలకు గురవుతున్నాం..



ఆర్.గార్లపాడు నుంచి ఎర్రవల్లి చౌరస్తాకు వెళ్లే రోడ్డుపై అధికంగా మలుపులు ఉన్నాయి. మలుపుల వద్ద ముళ్ల పొదలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడంలేదు. ఈ రోడ్డుపై కొత్తగా వచ్చే వాహనదారులు మలుపులను గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదభరితంగా మారిన మలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి.

– వీరన్న, ఆర్.గార్లపాడు

ముళ్లపొదలను తొలగించాలి..



మూల మలుపుల వద్ద రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు, ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. దీనివల్ల ఎదురుగా వస్తున్న వాహనాలు కన్పించకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలు, కంపచెట్లను తొలగించాలి.

– రాజు, సాసనూలు

సమస్యను పరిష్కరిస్తాం..

రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను తొలగించేందుకు, ప్రమాదకరంగా ఉన్న మూల మలుపుల వద్ద సూచికబోర్డుల ఏర్పాటు కోసం టెండర్లను ఆహ్వానిస్తున్నాం. టెండర్లు పూర్తయిన వెంటనే ముళ్లపొదలను తొలగించి, సూచికబోర్డులను ఏర్పాటు చేస్తాం.

– మహేష్‌కుమార్, ఆర్అండ్‌బీ ఏఈఈ, ఇటిక్యాల

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



మణిదీప వర్ణన పూజ నిర్వహిస్తున్న మహిళలు

శాంతినగర్: అధిక శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మణిదీపవర్ణన పూజా కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు చేశారు. 11 రకాల పుష్పాలు, 33 రకాల నైవేద్యాలు, 33 రకాల వత్తులతో అమ్మవారికి మణిదీప వర్ణన పూజ నిర్వహించి మహా మంగళహారతి ఇచ్చారు. కార్యక్రమంలో అర్చకులు వినయ్ కౌశిల్‌శర్మ, ఆర్య వైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తిమ్మప్పకు అభినందన



అలంపూర్: కన్స్యూమర్ ఫెడరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్పకు ఎమ్మెల్యే అబ్రహం అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లో రాష్ట్ర కోఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్ నూతన కార్యాలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని చైర్మన్‌ను శాలువాతో సన్మానించారు.

రైతుబాంధవుడు సీఎం కేసీఆర్



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మానవపాడు సహకార సంఘంలో..

రాజోళి: ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నదాతలకు అన్ని విధాలా అండగా ఉంటూ రైతుబాంధవుడిగా నిలిచారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. పంట రుణాలను మాఫీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ చేసే ప్రతి పనిలోనూ ప్రజాసంక్షేమం ఉందని, బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. కార్యక్రమంలో నతానియేల్, గోపాల్, శ్రీరాంరెడ్డి, గంగిరెడ్డి పాల్గొన్నారు.

మానవపాడు: రైతు సంక్షేమానికి సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకున్న రూ.19వేల కోట్ల రుణాలను మాఫీ చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు అయ్యన్న, సీఈఓ మద్దిలేటి, ప్రభాకర్‌నాయుడు, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంస

అయిజ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలతోపాటు కేజీబీవీలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన 25మంది విద్యార్థులను బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం మెమొంటో, నగదు ప్రోత్సాహకాలను అందజేసి అభినందించారు. కామ్రేడ్ పోతుల సుదర్శన్‌రెడ్డి స్మారక వేదిక నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి, మోటివేషన్ స్పీకర్ రవీంద్ర ధీర పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి వినతి



అలంపూర్: హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని శుక్రవారం మాదాసి, మాదారి కుర్వ ఎస్సీ సంక్షేమ ఐక్యవేదిక నాయకులు కలిశారు. మాదాసి, మాదారి కుర్వలకు స్థానిక తహసీల్దార్ నుంచి కుల ధ్రువీకరణ పత్రం జారీ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేశారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

మల్దకల్: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఇంచార్జ్ ఎంఈఓ కొండారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పాఠశాలలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరుశాతం, ఉపాధ్యాయుల పనితీరుపై ఆరా తీశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా పాఠ్యాంశాలు బోధించాలని సూచించారు. గ్రామాల్లో బడిబయటి పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని తెలిపారు. వారంలో మూడురోజులు విద్యార్థులకు రాగిజావ అందించాలని వంట ఏజెన్సీలకు సూచించారు.



మల్దకల్‌లో రాగిజావాను పరిశీలిస్తున్న ఎంఈఓ

‘ఎమ్మెల్యే చర్యను ఖండిస్తున్నాం’

గద్వాల రూరల్: మాదాసి, మాదారి కుర్వలను ఎస్సీ జాబితాలో చేర్చాలని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని దళిత ఐక్యవేదిక జిల్లా నాయకుడు మోహన్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యేలు రాజకీయ స్వలాభం కోసం ఇలా సొంత కులానికి ద్రోహం చేయడం సిగ్గుచేటని తెలిపారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



సీడ్ పత్తి పొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ

గట్టు: పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులను సాధించవచ్చని వ్యవసాయాధికారి హన్మంతురెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపల్లి శివారులో శుక్రవారం సీడ్ పత్తిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీడ్ పత్తి పొలాల్లో అక్కడక్కడ పచ్చదోమ, తామర పురుగు, తెల్లదోమను గుర్తించినట్లు తెలిపారు. వీటి వల్ల పత్తి ఆకులు ముడుచుకోవడం, పత్తికాయలపై మచ్చలు రావడం, ఎర్రతెగులు సోకుతుందన్నారు. వీటి నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రసం పీల్చే పురుగు నివారణకు ఫిప్రోనిల్ 500 ఎంఎల్‌ను ఎకరా విస్తీర్ణంలో పత్తి పంటపై పిచికారీ చేయాలన్నారు. ఎర్రతెగులు నివారణకు మెగ్నీషియం సల్ఫేట్ 10 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కాయలపై మచ్చల నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను ఎకరాకు 500 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రావణి పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

గట్టు: మండల కేంద్రానికి చెందిన పెద్ద భీమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహబూబ్‌పాషా, గట్టు–2 ఎంపీటీసీ కృష్ణ, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మారెప్ప తదితరులు అతడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

రోడ్డుకు మరమ్మతు

అయిజ: పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో గుంతలమయంగా మారిన రోడ్డుకు శుక్రవారం ఎస్ఐ నరేష్‌కుమార్ మరమ్మతు చేయించారు. మోకాలోతు గుంతలు ఏర్పడడంతో కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు కూడా ఇబ్బందిగా ఉన్నందున మరమ్మతు చేయించినట్లు ఎస్ఐ తెలిపారు.

కార్మిక గర్జనకు తరలిన పంచాయతీ కార్మికులు

గద్వాల అర్బన్: వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన కార్మిక సభకు జిల్లా నుంచి పంచాయతీ కార్మికులు భారీగా బయలుదేరారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి కార్తీక్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి హరీష్, నాగరాజు, బజారమ్మ, వెంకట్రామిరెడ్డి, మధు, రాఘవేంద్ర, మహేష్, మణెమ్మ పాల్గొన్నారు.

శాంతినగర్: హైదరాబాద్‌లోనిర్వహించిన కార్మిక గర్జనకు వడ్డేపల్లి మండలం నుంచి గ్రామపంచాయతీ కార్మికులు బయలుదేరారు. 25 రోజులుగా కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టినా ప్రభుత్వం స్పందించకపోవడంతో కార్మిక గర్జన చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.



గద్వాల నుంచి బయల్దేరిన కార్మికులు

పశువులకు టీకాలు

అయిజ: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం శుక్రవారం కొనసాగింది. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి ఆధ్వర్యంలో మండలంలోని బైనపల్లి, కుర్వపల్లి గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశువులకు వ్యాధులు ప్రబలకుండా తప్పనిసరిగా టీకాలు వేయించాలని ఆమె కోరారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

అలంపూర్: సంక్షేమ వసతిగృహాలను జిల్లా అధికారులు సందర్శించి సమస్యలను పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు కోరారు. పట్టణంలోని ఎస్సీ బాలికల వసతిగృహాన్ని శుక్రవారం కేవీపీఎస్ నాయకులు పరిశీలించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థినులతో వర్కర్లు పనులు చేయిస్తున్నారని తెలిపారు. మూత్రశాలలు, మరుగుదొడ్లను శుభ్రం చేయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. విద్యార్థినులతోనే మొక్కలు, చెట్లకు నీళ్లు పోయిస్తున్నారని తెలిపారు. మరుగుదొడ్ల తలుపులు సరిగా లేకపోవడం, నీటి వసతి అరకొరగా ఉండడంతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అదేవిధంగా కాస్మోటిక్ చార్జీలు సకాలంలో అందడం లేదన్నారు. హాస్టళ్లపై జిల్లా అధికారులు పర్యవేక్షణ పెంచాలని కోరారు. కార్యక్రమంలో వెంకటస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్ విద్యార్థినులతో మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకులు

మానవత్వం పెంపొందించేందుకు కృషి

గద్వాల న్యూటౌన్: మనుషుల్లో మానవత్వం పెంపొందించేందుకు బ్రహ్మకుమారీస్ సంస్థలు కృషి చేస్తున్నట్లు గుల్బర్గ జోన్ ఇంచార్జ్ బీకే విజయ తెలిపారు. గద్వాలలో రూ.4కోట్ల అంచనాతో నూతనంగా నిర్మించిన భవనాన్ని అక్టోబర్ 7న ప్రారంభిస్తున్న నేపథ్యంలో శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మనిషి తమ దైనందిక జీవితంలో యోగ, ధ్యానం ఆచరించాలని సూచించారు. భవన ప్రారంభోత్సవానికి బ్రహ్మకుమారీస్ ప్రధాన కేంద్రం అదనపు చీఫ్ బీకే జయంతి లండన్ నుంచి రానున్నట్లు తెలిపారు. బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మహాదేవి, గద్వాల ఇంచార్జ్ మంజుల, ప్రేమ్‌బాయిజీ ఉన్నారు.



మాట్లాడుతున్న బీకే విజయ

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఆయిల్‌పాం పంటను పరిశీలిస్తున్న ఏఓ

అలంపూర్ రూరల్: ఆయిల్‌పాం సాగుకు ప్రభుత్వం అనేక రాయితీలను అందిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ అనిత సూచించారు. మండలంలోని కోనేరులో శుక్రవారం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగుతో రైతులకు లాభం చేకూరుతుందన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. అదేవిధంగా అర్హులైన రైతులందరూ శనివారం లోగా రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు సన్మానం

గద్వాల రూరల్: ఇటిక్యాల తహసీల్దార్‌గా పనిచేసిన సుబ్రహ్మణ్యం ఇటీవల ఆర్డీవోగా పదోన్నతి పొందారు. అనంతరం గద్వాల భూసేకరణ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీఎస్ యూనియన్ నాయకులు ఎస్డీసీకి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విష్ణు, నాగరాజు, వీరావతి, నగేష్, లక్ష్మీనారాయణ, సూర్యప్రకాష్‌రెడ్డి, బుచ్చన్న పాల్గొన్నారు.



ఎస్డీసీని సన్మానిస్తున్న అధికారులు

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలి



సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ నర్సయ్య

అయిజ: పట్టణ ప్రజలు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ నర్సయ్య అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆర్‌పీలు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్‌బ్యాక్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నిర్దేశిత లక్ష్యం మేరకు స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్‌బ్యాక్ చేయించాలని ఆదేశించారు.

ఘనంగా గోకారమయ్య ఉర్సు

అలంపూర్ రూరల్: మండలంలోని కాశీపూర్‌లో గోకారమయ్య ఉర్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామంలోని పీర్లచావిడి నుంచి గోకరమయ్య దర్గా వరకు గంధం ఊరేగింపు నిర్వహించారు. శనివారం కిస్తీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బేగం, సర్పంచ్ రాములమ్మ పాల్గొన్నారు.

విద్యార్థికి చేయూత

అయిజ: మండలంలోని ఎక్లాస్‌పురం గ్రామానికి చెందిన మహబూబ్‌పాషాకు శుక్రవారం బీఆర్ఎస్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి రూ.15వేల ఆర్థికసాయం అందజేశారు. అంధులకు స్పెషల్ టీచర్ ట్రెనింగ్ ఇచ్చే సెంటర్‌లో మహబూబ్‌పాషా అడ్మిషన్ పొందేందుకుగానూ తనవంతు సహకారం అందించినట్లు తెలిపారు.

ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి



శాంతినగర్: ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని యశోద హాస్పిటల్ డాక్టర్ మోహన్‌లాల్‌నాయక్ సూచించారు. శాంతినగర్ మురళీ శ్రీనివాస్ ప్రథమ చికిత్స కేంద్రంలో శుక్రవారం ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎంపీ, పీఎంపీలు నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తాహేర్, మురళి, శ్రీనివాసులు, రజనీకాంతరావు, హుస్సేన్, శంకర్, శ్రీనివాస్, రవి, మాధవకృష్ణ, దర్గారెడ్డి, తిమ్మప్ప పాల్గొన్నారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ



అలంపూర్ తహసీల్దార్ మంజులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెవెన్యూ అధికారులు



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న మల్దకల్ తహసీల్దార్ వెంకటేష్

అలంపూర్: నియోజకవర్గంలోని పలు మండలాల్లో నూతన తహసీల్దార్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అలంపూర్ తహసీల్దార్‌గా మంజుల బాధ్యతలు చేపట్టగా, ఇంచార్జ్ తహసీల్దార్ సుభాష్ నాయుడు, ఆర్ఐలు, సర్వేయర్లు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కేటీదొడ్డి: మండల రెవెన్యూ అధికారిగా సరితారాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన సుందర్‌రాజు మహబూబ్‌నగర్‌కు బదిలీ అయ్యారు. ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న సరితారాణి మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరి సహకారంతో మండల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అంతకుముందు డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్ ఆమెకు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది కుమార్, తిరుపతి, వెంకటేష్‌నాయుడు, మౌలాలి పాల్గొన్నారు.

మల్దకల్: మండల తహసీల్దార్‌గా వెంకటేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన హరికృష్ణ గద్వాలకు బదిలీ కాగా.. ఆయన స్థానంలో రంగారెడ్డి జిల్లా వికారాబాద్ తహసీల్దార్ వెంకటేష్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ అనంతరం ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఆర్ఐలు నాగిరెడ్డి, రామకృష్ణ ఉన్నారు.

గట్టు: మండల తహసీల్దార్ మహ్మద్ జుబేర్ మొహిద్దీన్ మానవపాడుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వికరాబాద్ నుంచి వహిదా ఖాతూం మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి.

మానవపాడు: మండల తహసీల్దార్‌గా జుబేర్ మొహిద్దీన్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన యాదగిరి వనపర్తి జిల్లాకు బదిలీపై వెళ్లారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ సుబ్రహ్మణ్యం డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లు.. బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలు పార్టీలు, సంఘాల నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అయిజ: మండల తహసీల్దార్‌గా సహిదాబేగం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరి సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.